

'శ్రీశైలం'లో విద్యుదుత్పత్తి నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



శ్రీశైలం జలాశయంలో తక్షణమే విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగడం వల్ల డ్యాంలో నీటిమట్టం తగ్గిపోతుందని నీటి పారుదల ఇంజినీర్లు వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. రాయలసీమ ప్రాంతాల్లో అనావృష్టి వల్ల సకాలంలో పంటలు వేయలేకపోయారని తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాల వల్ల మన రాష్ట్రంలోని అనేక డ్యాంలు నిండాయి. అయితే జులై నెలలో వర్షాలు కురవకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. కర్నాటకలో కురిసిన భారీ వర్షాల వల్ల శ్రీశైలం, దాని కింద ఉన్న జలాశయాల్లో నీటిని వ్యవసాయానికి సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా రానున్న కరువులను కొంతమేరకు నివారించడానికి అవకాశం ఉందన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి అటు తెలంగాణ ఇటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని దిగువకు వదలడం వల్ల వెనుకబడిన ప్రాంతాలకు నీటి సమస్య పెరిగే అవకాశం ఉందన్నారు. రాయలసీమ ప్రాంతాలకు కొద్ది మేరకైనా నీరు అందుతున్నా హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. తుంగభద్ర జలాశయంలో 19వ గేట్ కొట్టుకపోవడంతో సుమారు 30 టిఎంసిలకు పైగా నీరు వృథా అయ్యిందన్నారు. తుంగభద్రపై ఆధారపడిన హెచ్ఎల్సి కాలువకు రావాల్సిన నీరు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తి కోసం విడుదల చేస్తున్న నీటిని నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'పెట్రో' దోపిడీ



పెట్రోల్‌బంకుల్లో యథేచ్ఛగా అక్రమాలు పట్టించుకోని తనిఖీ అధికారులు

పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వాలు అడ్డూఅదుపు లేకుండా పెంచుకుంటూ పోతుండటంతో నిత్యం ప్రజల జేబుకు చిల్లు పడుతోంది. గోరుచుట్టుపై రోకటి పోటులా పెట్రోల్ ధరలతో పాటు పెట్రోల్ బంకుల్లో కల్తీలు, అక్రమాలు పెరగడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. పెట్రోల్ బంకుల్లో జరిగే అవినీతిలో ఎవరి వాటా ఎంతో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి పెట్రోల్‌బంకులను తనిఖీ చేపట్టకపోవడంతో బంకు నిర్వాహకులు ఎంత పోస్తే అంతే లీటరు అన్న చందంగా మారిపోయింది. వినియోగదారుల నుంచి అడ్డంగా దోచుకుంటున్న డబ్బుల్లో ఎవరి వాటా ఎంత అన్నది పంచుకునే వారికే ఎరుక...

ప్రజాశక్తి-హిందూపురం

మానవ జీవితంలో పెట్రోల్ అనేది నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల సంఖ్య పెరిగే కొద్ది పెట్రోల్ బంకుల్లో తేడాలు కూడా అదే స్థాయిలో సాగుతున్నాయి. దీనివల్ల వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. అనేక పెట్రోల్ బంకుల్లో అంతర్గతంగా ఏర్పాటు చేసుకున్న కొలతల ద్వారా పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎక్కువ శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా పరీక్షకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండకపోవడం, కనీస సౌకర్యాలు లేకపోవటం అందరూ గమనిస్తున్న అంశాలు. పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలను అరికట్టడానికి తూనికలు కొలతల శాఖ, పౌరసరఫరాలు, రెవిన్యూ అధికారులతో పాటు ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు తనఖీలు చేయాల్సుంది. అయితే అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్లే బంకుల్లో ఇలాంటి మోసాలు హెచ్చుమీరుపోతున్నాయని వినియోగదారులు విమర్శిస్తున్నారు.

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ కరువు

జిల్లాల్లోని పెట్రోల్ బంకులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో యథేచ్ఛగా రీడింగ్ మీటర్‌ను ట్యాంపరింగ్ చేస్తూ కొన్ని బంకుల యాజమాన్యాలు వాహనదారులను దోచుకుంటున్నాయి. గతంలో ఎన్నోసార్లు పెట్రోల్‌బంక్ నిర్వాహకులు చేస్తున్న అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. నామమాత్రంగా చర్యలు తీసుకోవడం.. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో వందకు పైగానే పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో 15కుపైగా పెట్రోల్ బంక్‌లుండగా గ్రామీణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో మరిన్ని పెట్రోల్ బంక్‌లున్నాయి. రోజుకు పెట్రోల్ 1.30 లక్షల లీటర్లు, డిజిల్ 1 లక్ష లీటర్లు విక్రయిస్తున్నారు. వీటిని పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతలశాఖ, రెవెన్యూ విభాగాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. తహశీల్దార్లు, ఆర్‌డిఒలు తరచూ తనిఖీలు చేయాల్సి ఉండగా వారు ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కనీస సౌకర్యాలు, కల్తీ వంటి వాటిపై నిఘా ఊసేలేదు. దీంతో నిబంధనలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు మృగ్యం

జిల్లాలోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో కనీస సౌకర్యాలు ఎక్కడా కానరావడం లేదు. నిబంధనల ప్రకారం తాగునీరు, గాలినింపే యంత్రం, మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలి. విశ్రాంతి తీసుకునేందుకు వసతి ఏర్పాటు చేయాలి. ఈ మేరకు సెస్ వసూలు జరుగుతోంది. వాహనాలకు ఉచితంగా గాలి నింపే పరికరాలు తప్పనిసరి. టైర్లలో గాలి ఒత్తిడి సరిగ్గా లేకపోవడంతోనే ఇంధనం అత్యధికంగా వినియోగం అవుతుంది. డిజిటల్ మీటర్లను అన్ని బంక్‌ల్లో బిగించాలని చమురు సంస్థలు గతంలోనే ఆదేశించినా ఇంకా కొన్ని బంకుల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ మీటర్లను బిగించలేదు.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

తూనికలు, కొలతలశాఖ అధికారులు ప్రతి సంవత్సరం తూకాలను పరిశీలించి సీల్ చేస్తారు. కంపెనీల ప్రతినిధులు కూడా కొలతలను పరిశీలించాలి. అన్ని పెట్రోల్ బంక్‌ల్లో డీలర్ పేరు, ఫోన్ నెంబర్, డిఎస్ఒ, వారి సెల్‌ఫోన్ నెంబర్లు, వెబ్‌సైట్ అడ్రస్, టోల్‌ఫ్రీ నెంబర్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. అన్ని బంక్‌ల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్, ఐదు లీటర్ల క్యాన్‌లు సిద్ధంగా ఉంచాలి. అవి అనేక చోట్ల అందుబాటులో ఉంచడం లేదు. బ్లూ టుత్ ద్వారా తూకంలో మోసాలు చేస్తున్నారని తెలుస్తుంది. బంక్‌కు సంబందించిన భూమి వివరాలు, లీజ్ అగ్రిమెంట్, పట్టణంలో అయితే మున్సిపల్ సంస్థ అనుమతులను రెవెన్యూశాఖ పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే పౌరసరఫరాలశాఖ సరైన వసతులను, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ వ్యాట్, వివిధ రకాల పన్నులను చూసి అనుమతించాలి. అగ్నిమాపక శాఖ ప్రమాదాల నివారణ చర్యలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా శాఖలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కల్తీ తెలుసుకోవడం ఇలా..

పెట్రోల్ పంపు నాజిల్ నుంచి ఒక చుక్క పెట్రోల్‌ను ఫిల్టర్ కాగితంపై వేయాలి. పెట్రోల్ ఆవిరై కాగితంపై మరకలు లేక పోతే కల్తీ లేదని గ్రహించాలి. పెట్రోల్ బంకులకు ఆయిల్ తీసుకొచ్చేటప్పుడు ఇంధన సాంద్రతను వినియోగదారుడికి తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. పెట్రోల్ అయితే నాలుగు, డీజిల్ అయితే రెండు చొప్పున నమూనా బాక్సుల్లో సాంద్రతను నమోదు చేయాలి. కంపెనీ నుంచి వచ్చిన ఇంధనం, బంకుల్లో నమో దైన ఇంధన సాంద్రత మధ్య మూడు పాయింట్లు మించితే కల్తీ జరిగినట్లేనని గ్రహించాలి.

మొబైల్ వాహనంలో డిజిల్ అమ్మకాలు : కొంత మంది పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలను అతిక్రమించి కర్నాటక నుంచి డీజిల్ తీసుకు వచ్చి మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసుకుని పరిశ్రమల వద్దకు వెళ్లి అక్కడే వాహనాలలో నింపుతున్నారు. ఈ వాహనాలకు కనీసం పర్మిట్లు సైతం లేవు. పెట్రోల్ అయిపోయి వాహనం ఎక్కడైన నిలబడి పోతే సామాన్యులు బాటిల్ తీసుకుని వెళ్లి బంకులలో పెట్రోల్ వేయమని అడిగితే సవాలక్ష నిబంధనలు చెబుతారు. అయితే వేలకు వేల లీటర్ల డిజిల్‌ను గోరంట్ల రోడ్డులో ఉన్నా పరిశ్రమ వద్దకు మొబైల్ వాహనం ద్వారా తీసుకెళ్లి ఎలా విక్రయిస్తున్నారు? ప్రమాదకర స్థాయిలో డీజిల్ అమ్మకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. హిందూపురం పట్టణంలో కొంతమంది ఈ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కర్నాటక నుండి మొబైల్ వ్యాన్ల ద్వారా డీజిల్ రవాణా చేసి పరిశ్రమల్లో యంత్రాలకు, బస్సులకు యథేచ్ఛగా అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో తప్ప ఇతర ప్రాంతాల్లోకి రవాణా చేయరాదు. రవాణా చేయాలంటే నిబంధనల ప్రకారం పెట్రోలియం శాఖ నుంచి అనుమతులు తీసుకొని ట్యాంకర్ల ద్వారా మాత్రమే రవాణా చేయాల్సి ఉంది. అలాకాకుండా ప్లాస్టిక్ ట్యాంకర్లలో డీజిల్ రవాణా చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదు.



గోరంట్ల వద్ద ఉన్న పరిశ్రమ వద్ద మొబైల్ వ్యాన్ ద్వారా వాహనాలకు డిజీల్ వేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో మొబైల్ వాహనంలో అమర్చిన పెట్రోల్ వేయడాన్ని చూపే డిజిటల్ మీటర్)

జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే లక్ష్యం

నూతన ఎస్పీగా పి.జగదీష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసిన నూతన ఎస్పీ జగదీష్

జిల్లా నూతన ఎస్పీగా పి.జగదీష్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాధాన్యత ల్లో ఒకటైన బేసిక్ పోలీసింగ్‌లో భాగమైన అంశాలపై దృష్టి పెడతామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికపై ప్రత్యేక చొరవ చూపి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ రూపొందిస్తా మన్నారు. జిల్లా ప్రశాంతంగా ఉంచేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటామ న్నారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, నిష్పక్షపాతంగా, చట్టపరంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరైనా విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, సైబర్ నేరాల నియంత్రణలకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రవాణా, విక్రేతలు, వినియోగదారులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళ లు, చిన్నారులపై నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో మహిళా సమస్యల ను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హోంగార్డు నుంచి పోలీసు సిబ్బంది, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసులకు అవసరమైన సంక్షేమ చర్యలు తీసుకుంటాం.

నిత్యం అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

జిల్లాలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని నూతన ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లాలోని డీఎస్పీలతో ఎస్పీ డిపిఒలోని తన ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో తాజా పరిస్థితులపై సమీక్షించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల్లో భరోసా కల్గించేందుకు దోహదం చేసే బేసిక్ పోలీసింగ్‌ను మెరుగు పరుచుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీలు టివివి.ప్రతాప్, రవికుమార్, జనార్ధన్‌నాయుడు, శివభాస్కర్‌రెడ్డి, బివి.శివారెడ్డి, మునిరాజ(ఏఆర్) పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ని కలిసిన నూతన ఎస్పీ

రక్షా బంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ని సోమవారం నూతన ఎస్పీ పి.జగదీష్ కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీగా కలెక్టర్‌కు పూలమొక్కఅందజేశారు.



స్పాట్ అడ్మిషన్‌కు హాజరైన విద్యార్థులతో జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ఇంటిగ్రేటెడ్ కోర్సులతో విదేశాల్లో ఉద్యోగావకాశాలు

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటిగ్రేటెడ్ కోర్సులతో ఇక్కడి విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు తెలిపారు. అనంతపురం జెఎన్‌టియు, బ్లెకింగ్ యూనివర్శిటీ(స్వీడన్) సంయుక్తంగా అమలు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సోమవారం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆధ్వర్యంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. విసి ఇద్దరు విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. విసి మాట్లాడు తూ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీ.టెక్ కోర్సు మూడేళ్లు అనంతపురం జెఎన్‌టియులో, ఒక సంవత్సరం స్వీడన్ బ్లెకింగ్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుందన్నారు. బీ.టెక్ డిగ్రీని జెఎన్‌టియు అనంతపురం, బిఎస్ పట్టాను బ్లెకింగ్ వర్శిటీ ప్రదానం చేస్తుందన్నారు. ఆ తర్వాత ఎంఎస్ (మాస్టర్స్) ప్రోగ్రాం బ్లెకింగ్ వర్శిటీలో చేయవచ్చు అన్నారు. విదేశాల్లో ఉద్యోగం సంపాదించ డానికి ఇక్కడి విద్యార్థులకు ఇదొక గొప్ప అవకాశమన్నారు. ఇంటిగ్రేటేడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యుటర్ సైన్స్‌లో ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్ పొందారని తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్ ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకూ పొడిగించారని రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.దేవన్న, డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్ ఆచార్య పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ఆచార్య ఆర్.కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో పలువురు బాధ్యతల స్వీకరణ

జెఎన్‌టియులో సోమవారం అడిషనల్ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా డాక్టర్.అంకారావు డాక్టర్ ఎస్.శ్రీధర్, అకడమిక్ ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్. అరుణమస్తాని బాధ్యతలు స్వీకరిం చారు. వారు మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామ న్నారు. ఉపకులపతి, రిజిస్ట్రార్ నేతృత్వంలో వర్శిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. వారికి అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య ఎస్వి.సత్యనారాయణ, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగ ప్రసాద్‌నాయుడు, ఆచార్య జి.శంకర శేఖర రాజు, ఆచార్య ఎపి.శివకుమార్, డాక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ జసిక సరిత, డాక్టర్ కళ్యాణ్ కుమార్, యూనివర్సిటీ డైరెక్టర్లు, బోధన, భోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎం.విజయసునీత, ఎమ్మెల్యే, అధికారులు

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

రాష్ట్ర అగ్రి మార్కెటింగ్ డైరెక్టర్, రైతు బజార్ సిఇఒ ఎం.విజయసునీత

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర అగ్రి మార్కెటింగ్ డైరెక్టర్, రైతు బజార్ సిఈఓ ఎం.విజయసునీత పేర్కొన్నారు. ఆమె సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, యార్డు అధికారులతో కలిసి అనంతపురం మార్కెట్ యార్డ్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పండ్ల మార్కెట్‌లో వేలం నిర్వహించేందు కోసం అసంపూర్తిగా ఉన్న షెడ్‌ని వెంటనే పూర్తి చేయాలన్నారు. అభివద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివద్ధికి నిధులు కేటాయించాలని సిఇఒను కోరారు. మార్కెట్‌లో వేలం నిర్వహించేందుకు మరో షెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. పశువులు, పండ్ల మార్కెట్, చీని రైతుల వ్యాపారాల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ సిస్టం, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అభివద్ధి పనులకు ఇప్పటికే రూ. 4-5 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వాటిని మంజూరు చేయాలని మార్కెట్ అధికారులు కోరారు. వారి వెంట మార్కెటింగ్ శాఖ ఏడి సత్యనారాయణ చౌదరి, రీజనల్ జెడి రామాంజనేయులు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణా రెడ్డి, ఎస్డిసి శిరీష, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పిడి ఓబుళమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి మొత్తం 276 అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కార నిమిత్తం సంబంధిత జిల్లా అధికారులకు సూచనలు జారీ చేశారు. రెవెన్యూ సమస్యలపై సంబంధిత ఆర్‌డిఒ, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్, ఫోన్ ద్వారా మాట్లాడి అర్జీలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుని విధంగా చూడాలని ఆదేశించారు. ప్రజలు జిల్లా కేంద్రం వరకూ రావాల్సిన అవసరం లేకుండా శాఖల వారీగా ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఆ స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కారుణ్య నియామకాల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగోన్నతుల విషయంలో ఆయా శాఖాధిపతులకు లేఖలు పంపాలని, డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వారి జాబితాను తయారుచేసి పూర్తిస్థాయిలో జిల్లాలో పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసిద్ధిగాంచిన దేవాలయాలు, కట్టడాలు, స్థలాలను కాపాడుకునేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని డిఆర్‌ఓను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్డీవోలు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. తుంగభద్ర 19వ గేట్ పనులను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు సంబంధిత శాఖ ఇంజినీర్లకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.



'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

సమావేశంలో డిపిఒ ప్రభాకర్‌రావు, ఆర్.అండ్.బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిసిహెచ్ఎస్ పాల్ డా.రవికుమార్, డిటిసి వీరరాజు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ హసన్‌బాషా, సర్వే ఏడి రూప్లానాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, కలెక్టరేట్ ఏవో జి.మారుతి, సిపిఒ అశోక్ కుమార్, డీఆర్డీఏ పిడి ఓబులమ్మ, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్, ఏపీఎంఐపి పిడి రఘునాథ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా. కిరణ్ కుమార్ రెడ్డి, డీఎస్ఓ శోభారాణి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, చేనేత జౌళి శాఖ ఏడి అప్పాజీ, మార్కెటింగ్ ఏడీ చౌదరి, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, డిసిఒ అరుణకుమారి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డిపిఎం ఆనంద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్ చంద్ర, డీఆర్డీఏ ఏపిడి ఈశ్వరయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ

ఐద్వా, ఎస్ఎఫ్ఐ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్




కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను ఖండిస్తూ సోమవారం ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ఆధ్వర్యంలో నలంద కళాశాల విద్యార్థినులు రైల్వే స్టేషన్ కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై దుండగులు అత్యాచారం చేసి హత్యకు పాల్పడడం దేశానికే సిగ్గు చేటు అన్నారు. మహిళా వైద్యురాలికి రక్షణ లేకుండా పోయిందన్నారు. దేశంలో ఏదో ఒక చోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని, వీటంతటికీ డ్రగ్స్, పోర్న్, అశ్లీల చిత్రాలు, వెబ్‌సైట్‌లు, వంటివి కారణమని, కావున దేశ వ్యాప్తంగా వాటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. భారత్‌మాతాకి జై అనే నినాదంతో మహిళలకు రక్షణ కల్పించే ప్రభుత్వం మాది అంటున్న మోదీ సర్కార్‌కి ఈ దురాఘతాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిందితులను ఇప్పటిదాకా అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి పదవికి మమతాబెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించి ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలికి న్యాయం జరిగేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, చంద్రిక, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు ఇర్ఫాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధూ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, శివ, గణేష్, సాయి, వీరు ఐద్వా మహిళలు నారాయణమ్మ బాయి, లతితాబాయి, గౌతమి, శ్రీదేవి, రజిణి, త్రివేణి, ప్రశాంతి, ఆదెమ్మ పాల్గొన్నారు.

జూడాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

జూనియర్ డాక్టర్ హత్యాచారం ఘటనను నిరసిస్తూ జూనియర డాక్టర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పని ప్రదేశాల్లో వైద్యులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి పలువురు ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు మద్దతు తెలిపారు.



అంగన్వాడీ కార్యకర్త నిర్మలమ్మను అభినందిస్తున్న కలెక్టర్

అంగన్వాడీ టీచర్‌కు కలెక్టర్ అభినందనలు

అనంతపురం కలెక్టరేట్ : ఈ నెల 15వ తేదీ ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి ఎంపికై హాజరై వచ్చిన అంగన్వాడీ టీచర్ జి.నిర్మలమ్మను సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ భవన్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అభినందించారు. అలాగే ఆమెను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పండమేరులో వరద

రాప్తాడు : ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాప్తాడు వద్ద ఉన్న పండమేరులో వరద నీరు ప్రవహిస్తోంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలి వస్తున్నారు. వంక చుట్టుపక్కల పొలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు పండమేరు వంకలో గంగ పూజ చేసి టెంకాయలు కొట్టారు.



పండమేరులో ప్రవహిస్తున్న వర్షం నీరు



తూముచెర్ల-రంగంపేట రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటా సునీత, అధికారులు

తూముచెర్ల-రంగంపేట రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-ఆత్మకూరు

కనగానపల్లి మండలంలోని తూముచెర్ల నుంచి సిఎన్.కోట మీదుగా ఆత్మకూరు మండలంలోని రంగంపేటకు వెళ్లే రోడ్డును సోమవారం ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక నాయ కులు, వాహనదారులు ఎమ్మెల్యే కు సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ ముందుగా ఈ మార్గంలో మట్టి రోడ్డు వేయాలని అధికారులకు సూచించారు. అలాగే తారురోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ రోడ్డు సమస్య చాలా ఏళ్ల నుంచి ఉందని, టిడిపి ప్రభుత్వంలో తాను ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 4.8 కోట్లు మంజూరు చేయించానన్నారు. పనులు ప్రారంభిం చిన సమయంలో వైసిపి అధికారంలోకి వచ్చిందన్నారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను బెదిరించారని అందుకే ఈ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు వేస్తామని, త్వరలోనే తారురోడ్డు నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.



ధర్నాకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న సిపిఎం నాయకులు

23న ధర్నాకు మద్దతు ఇవ్వండి:సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వే ప్రాంతంలోకి ప్రజలు ప్రవేశించకుండా రహదారిపై అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ పట్టణంలోని డిఆర్ఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సిపిఎం నాయకులు రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులను కోరారు. ఈ విషయంపై సోమవారం ఆ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్ కుమార్‌తో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు భేటీ అయ్యారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ధర్నాకు మద్దతు ఇవ్వడమే కాకుండా ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు సురేంద్ర, రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో మున్సిపల్ కార్మికుల సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై సోమవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ప్రజావేదిక కార్యక్రమంలో కార్మికులు బైఠాయించి అధికారులను నిలదీశారు. మేయర్ మహమ్మద్ వసీం ఎదుట సమస్యలు ఏకరువు పెట్టారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 1200 మంది ఉండాల్సి ఉండగా 600 మందితోనే విధులు నిర్వహించడం బాధాకరం అన్నారు. రెగ్యులర్ కార్మికులు 188 మంది రిటైర్డ్ అయినా పదేళ్లుగా ఒక్క కార్మికున్ని పెంచకపోవడం దుర్మార్గమన్నారు. చనిపోయిన కార్మికుని స్థానంలో వారి కుటుంబంలో ఎవరికీ ఉపాధి కల్పించలేదని, ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వలేదన్నారు. డెత్ క్లెయిమ్ కూడా చేయలేదన్నారు. మహిళా కార్మికుల సమస్యలను అధికారులు కానీ పాలకవర్గం కానీ పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే 400 మంది కార్మికులను పెంచాలన్నారు. అలాగే గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వారంలోపు సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే సోమవా రం నుంచి ఒక పూట మాత్రమే విధులు చేస్తామన్నారు. అప్పటికీ పరిష్కరించకపోతే పూర్తిగా పనులు బంద్ చేస్తామని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత మున్సిపల్ అధికారులు, పాలకవర్గానిదే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు 2వ పట్టణ అధ్యక్షులు గురురాజా, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బత్తల ఆదినారాయణ, రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ముత్తురాజు, ఎం.నల్లప్ప, నగర అధ్యక్ష, కార్యద ర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనరసమ్మ, ఆదినారాయణ, శ్రీనివాస మూర్తి, ఇమాంబి, నారాయణస్వామి, కుళ్లాయప్ప, వెంకటేశులు, కమల్, తదితరులు పాల్గొన్నారు.



మేయర్ మహ్మద్‌వసీంకు సమస్యలు వివరిస్తున్న ఎటిఎం నాగరాజు, తదితరులు

నేడు బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో ఉన్న 39 మంది బిఎల్ఒలకు మంగలవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సుమతి తెలిపారు. మండలంలో బిఎల్ంఒలుగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, విఆర్ఎలు తప్పక శిక్షణకు హాజరు కావాలన్నారు. ఓటర్ నమోదుకు సంబంధించి 6, 7, 8 ఫారాలపై అవగాహన కల్పించి విధి విధానాలు ఎలా రూపొందించుకోవాలనే అంశంపై సమావేశం ఉంటుందన్నారు.

స్పందనకు ఐదు అర్జీలు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 5 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ సుమతి తెలిపారు. అందులో 4 పట్టాదారు పాసుపుస్తకాల కోసం, ఒకటి నూతన రేషన్ కార్డ్ కోసం అందాయన్నారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ నాగిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కూలిన వంతెన పరిశీలన

ప్రజాశక్తి-పామిడి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అనుంపల్లి నుంచి ఇమాంపురం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంతెన కూలిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆర్ఆర్.రమేష్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అనుంపల్లి గ్రామానికి వెళ్లి కూలిన వంతెనను పరిశీలించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌తో మాట్లాడి వంతెన మరమ్మతులకు నిధుల విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అనుంపల్లి గ్రామ నాయకులు భాస్కర్‌యాదవ్, కాయల మహేష్, ఆవుల శివ ఉన్నారు.



జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య హెచ్.సుదర్శన్ రావును సన్మానిస్తున్న అటానమస్ కళాశాలల యాజమాన్యాల సభ్యులు

అటానమస్ కళాశాలల సమస్యలు పరిష్కరిస్తాం

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య హెచ్.సుదర్శన్ రావు

ప్రజాశక్తి-అనంతపురం

అటానమస్ కళాశాలల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య తెలిపారు. ఇన్‌ఛార్జి విసి, రిజిస్ట్రార్‌లను సోమవారం అటానమస్ కళాశాలల యాజమాన్యాల సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి కళాశాలల్లోని సమస్యలు, వివిధ అంశాలను వివరించారు. స్పందించిన వారు ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో అటానమస్ కళాశాలల పాత్ర చాలా కీలకమన్నారు. ఉన్నత విద్యా విలువలు పాటించి కళాశాలను అభివృద్ధి పథంలో నడపాలని తెలిపారు. అనంతరం అటానమస్ కళాశాలల సభ్యులు విసి, రిజిస్ట్రార్‌తో పాటు ఆచార్య ఎన్. దేవన్నని సన్మానించారు. కార్యక్రమంలో అటానమస్ కళాశాల కరస్పాండెంట్ గంగిరెడ్డి, తదితరులు పాల్గొనడం జరిగినది.

శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు : ఎమ్మెల్యే

అనంతపురం కలెక్టరేట్ : శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టౌ టౌన్ సిఐ శ్రీకాంత్‌యాదవ్‌కు సూచించా రు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను సోమవారం టూ టౌన్ నూతన సిఐ శ్రీకాంత్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సిఐ క్రాంతి కుమార్ బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన నూతన సిఐ ఎమ్మెల్యేని కలిసి టూ టౌన్ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. ఎవరైనా పార్టీ పేరు కానీ, నా పేరు కానీ చెప్పి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించవద్దని సిఐకి సూచించారు. సామాన్య ప్రజలకు న్యాయం జరగడమే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే తెలిపారు.



ఎమ్మెల్యే దగ్గుపాటికి పూలబొకే ఇస్తున్న టూ టౌన్ సిఐ శ్రీకాంత్

గుత్తి సిఐగా బి.వెంకటేశ్వర్లు

గుత్తి : నూతన సిఐగా బి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ ఎం.వెంకటరామిరెడ్డి నంద్యాల జిల్లా ప్యాపిలి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. కర్నూలు జిల్లా ఆలూరులో పనిచేస్తున్న బి.వెంకటేశ్వర్లు బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నేరాల నియంత్రణ కు చర్యలు చేపడతామన్నారు.



పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

పుట్లూరు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ వర్షాలకు అరటి, మొక్కజొన్న, టమోటా, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కావున అధికారులు వాటిని పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే 2023 సంవత్సరానికి సంబంధించిన పంటల బీమా, పెట్టుబడి సాయం రూ. 20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలు సబ్సిడీతో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, ౦౦ మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, రాజకుళ్లాయప్ప, కెవిపిఎస్ నాగభూషణం, రైతులు మారుతి, నాగలింగారెడ్డి, రామాంజనేయులు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన



సైబర్ సెక్యూరిటీపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైబర్ సెక్యూరిటీ అంశంపై ఈ నెల 19 నుంచి 21 తేదీ వరకూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ సి.శోభా బిందు రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పాఠశాల విద్యార్థులకు సైబర్ సమస్యలు అంటే ఏంటి, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియజేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. శోభాబిందు మాట్లాడుతూ బయటి వారిని త్వరగా నమ్మవద్దని, డిజిటల్ లావాదేవీలపై అప్రమతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.బాలకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి.వెంకటనాగజయుడు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.హేమంత్ కుమార్ యాదవ్, కొర్రపాడు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జి.విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జి.సరళ, కళాశాల విభాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి మృతికి నివాళి

అనంతపురం అర్బన్ : నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఉద్యోగి గోవింద్‌గౌడ్(62) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలియడంతో డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి దేవి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజమనోహర్ రావు, తోటి ఉద్యోగులు సోమవారం స్థానిక పాతూరులోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేమానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోవింద్‌గౌడ్ స్టాటిస్టికల్ విభాగంలో డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారిగా పని చేసేవారు. వైద్య ఆరోగ్యశాఖలో 35 ఏళ్లుగా పని చేస్తూ ఈ నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందాల్సి ఉండగా ఇలా ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరపున కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు అందజేశారు.



గోవింద్‌గౌడ్ (ఫైల్ ఫొటో)

టిడిపి నేత మృతికి 'ఆలం' నివాళి

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు నాగర్జునరెడ్డి విద్యుదాఘాతంలో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆగ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీతో పాటు వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిట్టు రంగారెడ్డి, ఎర్రి నాగప్ప, రాఘవనాయుడు, లక్ష్మినాయుడు, లక్ష్మినారాయణ, తలారి కుళ్లాయప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, గోపాల్ రెడ్డి, నాగిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రమేష్, ప్రసాద్, రాజగోపాల్, శేఖర్, సత్యనారాయణరెడ్డి, భూషణ, నాగేంద్ర, కేశవరెడ్డి, శంకర్, వెంకటేష్, నాగేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగర్జునరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆలం నరసానాయుడు

రుద్రంపల్లి చెరువు గండిని పూడ్చాలని వినతి

కుందుర్పి : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని రుద్రంపల్లి గ్రామ చెరువులోకి నీరు చేరింది. అయితే చెరువుకు గండి పడడంతో నీరు వృథాతో పోతుండగా గ్రామస్తులు సోమవారం అడ్డుకట్ట వేయడానికి గట్టి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామస్తులు తహశల్దార్ శ్రీనివాసులును కలిసి గండి పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు.



తహల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



ఎద్దుల బండి పై పడిన విద్యుత్ స్తంభం

విరిగిపడిన విద్యుత్‌స్తంభం.. తృటిలో తప్పిన ప్రమాదం

యల్లనూరు : యల్లనూరులో సోమవారం మధ్యాహం ఉరుములు, మెరుపులతో కురిసిన గాలివాన ధాటికి ఓ విద్యుత్ స్తంభం విరిగి పక్కనే వున్న ఎద్దులబండిపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎద్దుల బండి పాక్షికంగా దెబ్బతినింది. దీంతో యజమాని, గ్రామస్తుఉలు ఊపిరి పీల్చుకున్నారు.



విద్యార్థులతో భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ పుష్పలత, అధికారులు

భూసార పరీక్షలపై అవగాహన అవసరం

సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్ఆర్.పుష్పలత

ప్రజాశక్తి-అనంతపురం

భూసార పరీక్షలపై ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ ఎల్ఆర్.పుష్పలత సూచించారు. ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న 14 మంది విద్యార్థులు గత నెల 29 నుంచి ఈనెల 14వ తేదీ వరకూ భూసార పరీక్షలు, దాని ఉపయోగాలు, మట్టి నమునా సేకరించే విధానం, పిహెచ్, ఈసి, ఓసి, ఎన్‌పికె, తదితర వాటిపై భూసార పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారికి సోమవారం సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేందం వ్యవసాయ అధికారులు పి.శ్రీనాథ్‌రెడ్డి, కె.నాగేంద్ర, ఉమామహేశ్వరి, రుమాన బేగం, ప్రతాప్, అర్చన, ఆర్ట్స్ కాలేజీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా నిరసన

గుత్తి : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా గుత్తిలో మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు ఆందోళన చేపట్టి అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీ భారత్ బంద్‌లో భాగంగా జిల్లా బంద్ కు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు సంస్థలు, దుకాణాలు, హోటళ్లు స్వచ్ఛందంగా బంద్ చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చలపతి, నాగప్ప, నాగరాజు, శ్రీరాములు, న్యాయవాదులు సాలప్ప, రామాంజనేయులు, హరిదాసు పాల్గొన్నారు.

పుట్లూరులో తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి

పుట్లూరు : మండల కేంద్రమైన పుట్లూర్లుఓ తాగునీటి సమస్య తీవ్రమైందని, తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తుడు పుల్లారెడ్డి కలెక్టర్‌తో మాట్లాడుతూ యల్లనూరు మండలంలోని చిత్రావతి నది నుంచి, గండికోట డ్యాం నుంచి కూడా పుట్లూరుకి పైప్‌లైన్లు ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో తేజేశ్వర్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఉన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పామిడి : స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారని, అవసరమైతే ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డులలో ఏదైనా ఒకటి జిరాక్స్ కాపీ, రెండు పాస్ ఫొటోలతో రావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : సోమవారం మధ్యాహం కురిసిన గాలివాన ధాటికి మండలంలోని పెద్దమల్లేపల్లి, యల్లనూరు, తదితర గ్రామాల్లో ట్రాన్సఫార్మర్లు, విద్యుత్ లైన్లు, స్తంభాలు నేలకొరిగాయి. వాటి మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని లైన్‌మెన్ ఓబులేసు తెలిపారు.

ఆటో డ్రైవర్ల శ్రమదానం

గుత్తి : పట్టణంలోని జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతల్లో సోమవారం ఆటో డ్రైవర్లు మట్టి వేసి పూడ్చారు. వారు తొలుత పట్టణ శివారు నుంచి తమ ఆటోల్లో ఎర్రమట్టి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్, గుంతకల్లు రోడ్డు, తది తర ప్రాంతాల్లో ఉన్న గుంతలను పూడ్చి చదును చేశారు. ఆటో డ్రైవర్ల సేవలను వాహనదా రులు, ప్రజలు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్వేశ్వర్, షేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.



మట్టి వేసి రహదారిపై గుంతలు పూడ్చుతున్న ఆటో డ్రైవర్లు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శింగనమల : మండలంలోని లోలూరు మలుపులో ఐచర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పామిడి మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి(47) మరొకరితో కలిసి ద్వి చక్రవాహనంపై అనంతపురం వెళ్లి పని ముగించు కొని తిరిగి స్వగ్రామం బయల్దేరాడు. మార్గమధ్యలో లోలూరు క్రాస్ వద్దకు రాగానే అనంతపురం నుంచి గుత్తి వైపు అతివేగంగా వెళ్తున్న ఐచర్ వాహనం ముందు వెళ్తున్న వీరిని ఢీకొనడంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఐచర్ డ్రైవర్ బండిని ఆపేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న శింగనమల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని108 వాహనంలో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

అనంతపురం క్రైం : అనంతపురం 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల క్రితం జరిగిన పోక్సో కేసులో ఒక వ్యక్తికి 3 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి టి.రాజ్యలక్ష్మి తీర్పు ఇచ్చారు. అలాగే బాధితురాలికి రూ. 1.5 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. 2020లో అప్పటి ఎస్ఐ జమాల్ బాషా దర్యాప్తు చేపట్టి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారించిన జడ్జి నిందితుడు గుడిమల్ల వినోద్ కుమార్‌కి శిక్ష విధించారు.

గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధం

గుత్తి : పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఓ హోటల్‌లో సోమవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిం డర్ పేలి హోటల్ దగ్ధమైంది. ఉదయం పని మనిషి రంగా హోటల్‌ను తెరిచి గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు రావడంతో అతడు బయటికి పరుగులు తీశాడు. మంటలు ఎగిసి పడి గ్యాస్ సిలిండర్ పేలి హోటల్‌లోని ఫ్రిజ్, కూలర్, ఫర్నిచర్, వంట వస్తువులు ఖాళీ బూడిద య్యాయి. హోటల్ భవనం కూలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ .10 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ సాయం కోసం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.

పట్టపగలే రూ. 3 లక్షలు చోరీ

ఉరవకొండ : పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే టవర్ క్లాక్ సమీపంలోని చర్చి వద్ద ఉన్న వంశీ టైలర్ (ఎర్రిస్వామి) షాపులో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి రూ. 3 లక్షలు ఎత్తుకెళ్లాడు. బాధితుడు టైలర్ ఎర్రిస్వామి మాట్లాడుతూ స్థలం రిజిస్ట్రేషన్ కోసం బ్యాంకులో రూ. 3 లక్షలు డ్రా చేసి టైలర్‌షాపులో తన కొడుకు రాఘవేంద్రని ఉంచి పని మీద బయటకు వెళ్లానన్నారు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుస్తుల కొలతలు సరి చేయాలని తన కుమారుడిని మాటల్లో పెట్టి రూ. 3 లక్షలు ఎత్తు కెళ్లాడని వాపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు టైలర్ షాపు వద్దకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు.

చోరీ కేసులో పది మంది అరెస్ట్

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని హెచ్.సిద్దాపురం గ్రామ సమీపంలోని ఓబులాపురం మైనింగ్ కంపెనీ క్వారీ వద్ద సిబిఐ సీజ్ చేసిన వాహనాల విడి భాగాల చోరీ కేసులో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ వెంకటరమణ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఓఎంసీలో సిబిఐ సీజ్ చేసిన వాహనాలను గ్యాస్ కట్టర్ల సాయంతో కట్ చేస్తున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ చేయగా బళ్లారికి చెందిన ఖలీద్, తౌసిఫ్, ఉలిగప్ప, రియాజ్ అహ్మద్, మహమ్మద్ బషీర్, రేణుకప్ప, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆసిఫ్‌ఖాన్, అమన్, రవూఫ్‌ఖాన్, సిద్దాపురం గ్రామానికి చెందిన భాస్కర్‌గా తెలిసిందన్నారు. వీరు ఈ నెల 16వ తేదీ ఓఎంసీలో ఉంచిన జెసిబి, హిటాచీలను కట్ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు డి.హీరేహాల్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బందితో కలిసి దాడులు చేసి పది మందిని పట్టుకుని, 17 గ్యాస్ సిలిండర్స్, 1 బొలెరో వాహనం, 2 మోటార్ సైకిల్స్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రాయదుర్గం కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్‌కు అనంతపురం జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. సిఐతో పాటు డి.హీరేహాల్ ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పుట్లూరు : మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో సోమవారం బాలరాజు, నాగేంద్ర ఇంటి ముందు పైపులైన్ పగిలిన విషయంలో గొడవ పడ్డారు. ఈ విషయంలో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



కందికుంటకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



మంత్రి సత్యకుమార్‌కు రాఖీ కడుతున్న మహిళలు



జెఎన్‌టియు విసితో బ్రహ్మకుమారిలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం రక్షాబంధన్ పురస్కరించుకొని పలువురు మహిళలు, బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్ : సొంత అక్క చెల్లెళ్లతో పాటు, సమాజంలోని బాలికలు, మహిళలందరినీ సోదర భావంతో చూడాలని శ్రీ సత్య సాయి జిల్లా జిల్లా ఎస్పీ వి రత్న తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఓం శాంతి వారి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ వి.రత్న కి , అదనపు ఎస్‌పి ఎన్. విష్ణుకి రాఖీలు కట్టి ఈ రక్షాబంధన్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఎస్పీ స్వయంగా పోలీస్ అధికారులకు సిబ్బందికి రాఖీలు కట్టి మిఠాయిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు శ్రీనివాసులు సతీష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మహిళలకు రక్షణకు కల్పించే ప్రభుత్వం ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉందని టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం ధర్మవరం టీడీపీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుమహిళలు పెద్దఎత్తున పార్టీ కార్యాలయానికి వచ్చి పరిటాల శ్రీరామ్‌కు రాఖీ కట్టారు.

మడకశిర : రాఖీ పండుగ సందర్భంగా సోమవారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఇతర నాయకులకు రాఖీలు కట్టారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపినిర్మల జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లల ప్రేమానురాగాలు, వారిబాధ్యతలు, బంధాలు రాఖీ పం డుగ విశిష్టతను వివరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశరెడ్డి, పద్మ. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలో సోమవారం రాఖీ పౌర్ణమి ఘనంగా జరుపుకొన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సమన్వయకర్త బికె.యోగేశ్వరి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, జూనియర్ సివిల్ జడ్జి రమ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పోలీసులు, ఇతర అధికారులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు ఎమ్మెల్యే కాలవతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, ఉపాధ్యాయులు, అధికారులకు, రాఖీలు కట్టారు.

కళ్యాణదుర్గం : రక్ష బంధన్ సందర్భంగా స్థానిక సరస్వతీ విద్యా మందిరం విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం వెళ్లి తహశీల్దార్ భాస్కర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ విద్యార్థులను ఆశీర్వదించారు

ధర్మవరం టౌన్ : జనసేన పార్టీకార్యాలయంలోసోమవారం రాఖీపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీకి చెందిన నాయకురాళ్లు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శిచిలకం మధుసూదన్‌రెడ్డికి రాఖీ కట్టారు. జనసేన నాయకురాలు కొండాదుర్గమ్మ చిలకం మధుసూదన్‌రెడ్డికి రాఖీ కట్టారు.

అనంతపురం అర్బన్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అనంతపురంలో డిఎంహెచ్ఒ డా. ఇబి దేవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం టౌన్ : దేశ వ్యాప్తంగా రాఖీ పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం రాఖీ పండుగను సిఎన్‌బి హాల్లో జరుపుకున్నారు. రాఖీ కట్టిన వారందరికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్ ,సాకే ఓబుళేశు, జింకాచంద్రశేఖర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, పలువురు ఆచార్యులకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ధ్యాన మందిరం సభ్యులు రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీలు, ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో రాజీవ్ కాలనీ సర్పంచి ఆశాబి, ఎంపీటీసీ సంధ్య, పలువురు కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులపై తేనెటీగల దాడి

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు అమరేంద్ర, విష్ణుపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామ సమీపంలోని వారి వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా విష్ణుపై తేనెటీగలు దాడి చేశాయి. గమనించిన తండ్రి రక్షించేందకు వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాయి. గుర్తించిన సమీప పొలాల రైతులు వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఉత్తమ ఎంఇఒగా అవార్డు అందుకున్న సోమందేపల్లి ఎంఇఒ ఆంజనేయ నాయక్‌ను, ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా అవార్డు అందుకున్న రాజశేఖర్ రెడ్డిని ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎస్ఐ రమేష్ బాబు తదితరులు అవార్డు గ్రహీతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల జాక్టో నాయకులు చంద్ర, సంజీవ రాయుడు, నాగరాజు, శివన్న, రామకృష్ణ నాయక్, అశ్వర్థప్ప, విజయ్ కుమార్ నాయక్, దస్తగిరి, సోమశేఖర్, లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

హెచ్ఐవి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేష్ చౌదరి సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని జన జాగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో కదిరి ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర చౌదరి, అరుణ, కేర్ స్టాఫ్, జూనియర్ కాలేజీ ఉపాధ్యాయులు, జనజాగృతి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను గుర్తించాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఫొటోగ్రాపర్లను ప్రభుత్వం చేతివృత్తిదారులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు లక్ష్మినారాయణ కోరారు. ఫొటో గ్రాఫర్స్ డే సందర్భంగా వారు సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, బాలాజీ, ప్రసన్న, నవీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చంద్రన్న ప్రెస్‌క్లబ్లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వేడుకలను సోమవారం శిల్క్ సిటీ ఫొటో అండ్ వీడియోవెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్స్ హరి, మూర్తి, రామచంద్ర, అంబిక శ్రీనివాసులను సన్మానించారు. అనంతరం గొట్లూరు అనాధాశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీ యూనియన్ నాయకులు రాము, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఏర్పాటు

హిందూపురం : కళాకారుల ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని కళాకారుల ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి అంజప్ప, గౌరవ సలహాదారుగా మల్లేష్, అధ్యక్షులుగా పి శివకుమార్, ఉపాధ్యక్షులుగా కెకె. శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మిలిటరీ చలపతి, సహాయ కార్యదర్శిగా సంపూర్ణమ్మ, కోశాధికారిగా ఎస్‌టి. దాసప్ప, పోగ్రాం ఆర్గనైజర్‌గా దయానంద్ తో పాటు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ చంద్ర, శ్రీధర్ గౌడ్, లోకేష్, శంకరప్ప, రాజ్యలక్ష్మి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంట పెట్టుబడి సాయం ఇవ్వాలి

ఉరవకొండ : ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ. 20 వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబి ఇన్సూరెన్స్ ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ సోమవారం స్థానిక వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిహెచ్‌సి నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సిహెచ్‌సి వైద్యాధికారి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వమే పూర్తి రక్షణ కల్పించాలన్నారు. వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని మహిళ, ప్రజా సంఘాలు ఖండించాలని, బాధ్యులు ఎంతటి వారైనా చట్ట పరంగా కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీరంగయ్య, స్వర నాగప్ప, సిపిఐ నాయకుడు ఓంకార్, రవిచంద్ర, నారాయణ, పెద్దన్న, మునెయ్య, కోటి, నాగరాజు, ప్రసాద్, టిడిపి నాయకుడు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

ప్రజాశక్తి - యల్లనూరు

మండలంలోని మల్లాగుండ్ల గ్రామంలో ఉన్న 18వ నెంబర్ రేషన్ షాపును సోమవారం విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రరెడ్డి తనిఖీ చేశారు. షాపులో 85 కిలోల బియ్యం తక్కువ వున్నట్లు అధికారులు గుర్తించి షాపును సీజ్ చేశారు. తనిఖీల్లో డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, విఆర్ఒ షబాన, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటుపై ఎమ్మార్పీఎస్ హర్షం

అనంతపురం కలెక్టరేట్ : దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌సెల్ నిర్వహించడం ఎంతో హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్, విజిలెన్స్ కమిటి సభ్యులు బిసిఆర్.దాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి : ప్రభుత్వ సబ్సిడీతో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి సోమవారం తెలిపారు. మామిడి, జామ, అల్లనేరేడు, దానిమ్మ, అరటి, బొప్పాయి మొక్కలు పెట్టుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంద న్నారు. అలాగే ఫారంపాండ్లు, ప్యాక్స్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-గుత్తి

వాల్మీకి, బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ సోమవారం ఎపి వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లెల్లి కృష్ణయ్య మాట్లాడుతూ వాల్మీకి, బోయలు అన్ని రంగాల్లో వెనుక పడ్డారన్నారు. వారు విద్య, ఉద్యోగ, సామాజిక పరంగా అభివృద్ధి చెందాలంటే గిరిజనుల జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.జయరాం, నాయకులు బి.లాల్‌శేఖర్, ఎం.సత్యనారాయణ, బి.నవీన్, బి.నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుందుర్పి : రైతు సంక్షేమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిని నాయకులు రవి, రాఘవేంద్రబాబు, హనుమంత రాయుడు, ఆనంద్ తెలిపారు. వారు సోమవారం తహశీల్దార్ ఎస్‌బి.శ్రీనివాసులును సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనేక కంపెనీలు తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారన్నారు.